క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన



పూజల్లో పాల్గొన్న భక్తులు

కొయ్యూరు: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో శుక్రవారం కొయ్యూరు కనకదుర్గమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎం.వి.ఎస్‌.ప్రసాద్‌, కమిటీ సభ్యులు చిరంజీవి, చిన్న, అర్చకులు కృష్ణ శర్మ టీటీడీ ధర్మప్రచార కర్త పద్మరాజు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సింగవరం దుర్గమ్మ ఆలయంలో అర్చకులు శ్రీరామచంద్రమూర్తి, శర్మ సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. సర్పంచ్‌ బాలరాజు చేతుల మీదుగా భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఆలయ కమిటీ సభ్యులకు మైక్‌సెట్‌ను వితరణ చేస్తున్న దాతలు

కొయ్యూరు: మండలంలోని కొండగోకిరి పంచాయతీ కొత్తపాలెంలో ధార్మిక సంస్థ సేవ అధ్యక్షుడు డి.వి.డి.ప్రసాద్‌ ఆధ్వర్యంలో అర్చకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న దానధర్మ చారిటబుల్‌ సంస్థ అధ్యక్షుడు కమలాకర్‌ మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. నగర సంకీర్తన నిర్వహించారు. గంగవరంలోని వినాయక దేవాలయానికి మైక్‌సెట్‌ను, రామన్నపాలెం భజన బృందానికి సామగ్రిని అందజేశారు. బి.వి.భారతి, కృష్ణ, లోవరాజు, మల్లేష్‌, మంగ, బొజ్జిబాబు, వీరాస్వామి పాల్గొన్నారు.

గ్రామస్తుల శ్రమదానం



అరకు సంత గ్రామంలో శ్రమదానం చేస్తున్న సర్పంచ్‌ శారద

డుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ కేంద్రంలో శ్రమదానం చేపట్టి అరకులో పేరుకు పోయిన తుప్పలు, డ్రైనేజీల్లో వ్యర్థాలను సర్పంచ్‌ శారద ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ శారద మాట్లాడుతూ శ్రమదానం కార్యక్రమం చేపట్టి ఇరువైపులా తుప్పలు, చెత్తను తొలగిస్తు పంచాయతీ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. కొంతమంది గిరిజనుల శ్రమదానంలో పాల్గొన్నారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొని శ్రమదానం చేశారు. ప్రతి ఒక్క గిరిజన కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలంటే ముందు పరిసరాలతో పాటు వ్యక్తి గత శుభ్రత అవసరమన్నారు. పంచాయతీ సెక్రటరీ వల్లిబాబు, రమేష్‌ పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు నిలిపివేయాలి



రంపచోడవరంలో ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు

రంపచోడవరం: పాలస్తీనా, లెబనాన్‌ దేశాలపై ఇజ్రాయెల్‌, అమెరికా దురాక్రమణ దాడులు వెంటనే నిలుపు చేయాలని డిమాండ్‌ చేస్తూ సీపీఐ (ఎంఎల్‌) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో రంపచోడవరంలో గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్‌ సెంటర్‌ వరకు ర్యాలీ జరిగింది. అనంతరం సీపీఐ(ఎంఎల్‌)న్యూడెమోక్రసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సదస్సులో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య మాట్లాడుతూ ఇజ్రాయెల్‌, అమెరికా తదితర యూరప్‌ దేశాల మద్దతుతో పాలస్తీనా ప్రజలపై తీవ్రమైన దాడులు చేస్తున్నారన్నారు. దాడుల్లో పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు, వందలాది మంది చనిపోతున్నారని, దాడులు ఆపాలన్నారు. లచ్చిరెడ్డి, బాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ.. నమోస్తుతే

- ఘనంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు
- మహిషాసుర మర్దని రూపంలో అమ్మవారి దర్శనం
- దసరాకు సర్వం సిద్ధం
- ముస్తాబైన దుర్గాదేవి ఆలయాలు
- గ్రామాల్లో పండగ సందడి



జడ్డంగి ఆలయంలో మహిషాసురమర్దని అలంకారంలో దర్శనం ఇచ్చిన దుర్గామాత



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



పెదబయలు దుర్గాదేవి మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



చవిటిదిబ్బలులో కనకదుర్గమ్మ ఆలయం వద్ద అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు



చింతపల్లిలో ప్రత్యేకాలంకరణలో దుర్గాదేవి అమ్మవారు



అన్నసమారాధనలో భక్తులు



కొయ్యూరులోని అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదబయలు: జిల్లా వ్యాప్తంగా దుర్గాదేవి శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పెదబయలు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రీదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా 8వ రోజు శుక్రవారం మహిషాసుర మర్దిని రూపంలో దుర్గమ్మను అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులతో పాటు అధిక సంఖ్యలో భవానీ మాలధారులు దర్శించుకున్నారు. దుర్గమ్మ నామస్మరణతో ఈ ప్రాంతమంతా మార్మోగింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి సింహాచలం, మోటర్‌ యూనియన్‌ నాయకులు నీలయ్య, కిశోర్‌ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కొయ్యూరు: మండలం కేంద్రంలోని దుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం భవానీ మాలధారుల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అరటి దొంలలతో మెట్లను తయారు చేసి ప్రతి మెట్టుకు దీపాలను వెలిగించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు కమిటీ ప్రతినిధులు ప్రసాద్‌, చిన్న, చిరంజీవి తదితరులు చెప్పారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని రంగానెంటర్‌లో దుర్గాదేవి అమ్మవారి విగ్రహానికి ప్రత్యేకాలంకరణలు చేశారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు కనకదుర్గమ్మవారి ఆలయం వద్ద గురువారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. భవానీ మాలధారులతో పాటు భక్తులు ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అగ్నిగుండంలో నడిచారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు.

రాజవొమ్మంగి: దసరా ఉత్సవాలకు ఊరువాడలోని దుర్గాదేవి ఆలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని రాజవొమ్మంగి కొండపల్లి, దూసరపాము, జడ్డంగి, లాగరాయి, శరభవరం తదితర గ్రామాల్లో గల దుర్గాభవానీ ఆలయాల్లో భక్తులు శనివారం వేకువ జామునుంచే అమ్మవారిని దర్శించుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మండలవ్యాప్తంగా గల ఆలయాల్లో శుక్రవారం దుర్గాదేవి మహిషాసుర మర్దని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దసరాను పురస్కరించుకొని గృహాలను సుందరంగా అలంకరించుకున్నారు. తొమ్మిది రోజులుగా కలశస్థాపన చేపట్టి పూజలు చేస్తున్న గృహాలను శనివారం పూజ అనంతరం ముత్తైదువులకు తాంబూలాలు ఇచ్చేందుకు అన్ని సిద్ధం చేసుకొన్నారు. మండలవ్యాప్తంగా భవానీమాలధారులు ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



హిమగిరి, సీఐ

అరకులోయ రూరల్‌: అరకులోయ సర్కిల్‌ డుంబ్రిగుడ, అనంతగిరి, అరకులోయ మండలాల పరిధిలో దసరా వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ హిమగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్‌ పరిధిలో ఉన్న మూడు మండలాల్లో ప్రజలందరూ సుఖ సంతోషాలతో దసరా పండగ వేడుకలు నిర్వహించుకోవాలని గ్రామాల్లో ఎటువంటి గొడవలు, తగాదాలు చేసుకోవద్దన్నారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన టొటవచేసుకున్న పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఉన్న యువత, ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు.

జయభారత్‌కు అభినందనలు

చింతపల్లి: రాష్ట్ర కాంగ్రెస్‌ పార్టీ ఎస్టీ సెల్‌ అధ్యక్షుడిగా రేమల జయభారత్‌ని నియమిస్తు కాంగ్రెస్‌ పార్టీ పార్లమెంట్‌ సభ్యులు అఖిల భారత కాంగ్రెస్‌ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ నుంచి ఉత్తర్వులు వెలువడింది. ఈ సందర్భంగా జయభారత్‌ మాట్లాడుతూ గత ఎన్నికల్లో అరకు పార్లమెంట్‌ స్థానానికి పోటీ చేయడాన్ని ప్రయత్నాన్ని దేశానన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. జయభారత్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

రైతులకు సూచనలు



వంకబూసిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని పి యర్రగొండ పంచాయతీ వంకబూసి గ్రామంలో శుక్ర వారం పతంజలి ఫుడ్స్‌ లిమిటెడ్‌ కంపెనీ వారి ఆధ్వర్యంలో పామాయిల్‌ రైతులకు శిక్షణ ఇచ్చారు. డ్రిప్‌ ఇరిగేషన్‌, దీడిపోదల నివారణ, గెటే యాజమాన్యం, గెలలు నాణ్యత, కలుపు నివారణ, ఎరువుల వాడకంలో నాణ్యతాప్రమాణాలు పాటించడం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే, అధికదిగుబడి సాధించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కొత్తగా నాటిన పామాయిల్‌ తోటల్లో నువ్వుకుట్ల తెగులు పురుగులను, బూజు తెగుళ్లనుంచి పంటను రక్షించు కోవడానికి నివారణ చర్యలల్లో భాగంగా పిచికారి చేయవలసిన పురుగుల మందులపై అవగాహన కల్పించారు. అలాగే నాలుగేళ్ల మొక్క తోటల్లో అంతర పంటలు వేస్తే, రైతులకు అధిక ఆదాయం తదితర విషయాలను వివరించారు. రైతులకు మొక్కలు పంపిణీలో కల్పించే రాయితీలపై తెలియజేశారు. పామాయిల్‌ తోటల పెంపకానికి ముందుకు రావాలని పతంజలి ఫుడ్స్‌ అధికారులు కోరారు. శాస్త్రవేత్త దుర్గాప్రసాదు, సూపర్‌వైజర్‌ రాంబాబు, ఆదర్శ రైతులు రమణారెడ్డి, బాబూరావు, నీలంరెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీ యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్‌



అరకులోయ రూరల్‌: ఆదివాసీ యువతతో రాష్ట్ర కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి మొస్య రంజిత్‌కుమార్‌ తెలిపారు. రాష్ట్రంలో ఓటువేసి కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చినందుకు భవిష్యత్‌లో అన్ని రంగాలకు నాయకత్వం వహించాల్సిన యువతకు మొండిచేయి చూపిస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆదివాసీలు రాణించారని, ఆర్థికంగా బలోపేతం కావాలని పాడేరు జిల్లా కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతిని ఓర్వలేక జిల్లా కేంద్రం నిర్వీర్యానికి తెరతీసే కుట్ర చేస్తుందన్నారు. ఇటువంటి ప్రభుత్వాలతో యువత జీవితాలు నిర్వీర్యమవుతాయన్నారు. జిల్లా కేంద్రాన్ని పాడేరు నుంచి తరలించే కుట్ర విరమించుకోవాలని లేని పక్షంలో అన్ని వర్గాల ప్రజలతో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చింతపల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆహ్లాదకరమైన ఆరోగ్యం కలిగి ఉంటామని సీఆర్పీఎఫ్‌ కమాండెంట్‌ మనోజ్‌కుమార్‌ అన్నారు. అన్నవరం పంచాయతీ కేంద్రంలో గల వారపు సంత పరిసరాల్లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రాంతాల్లో ఎప్పుడు పరిశుభ్రతను పాటించాలని దీంతో మంచి ఆరోగ్యాన్ని పొందుతారన్నారు. సీఆర్పీఎఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ టి.ఆర్‌.సేనాపతి, ఎస్‌ఐ కె.ఎస్‌.స్వామన్‌, ఏఎస్‌ఐ పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండగ



బోనాల ఊరేగింపులో భక్తులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంత గ్రామంలో శుక్రవారం విజయదశమి సందర్భంగా గిరిజనులు భక్తిశ్రద్ధలతో బోనాలను ఊరేగిస్తూ సమీప దుర్గ దేవి ఆలయం వద్ద బోనాలను సమర్పించారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. శనివారం జరిగే దసరా ఉత్సవాలలో ఆలయ అర్చకుడు సూరజ్‌ త్రివేది ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వేట కోసం విద్యుత్‌ తీగలు అమర్చితే కఠిన చర్యలు



ఆకుమామిడకోటలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ గోపాలకృష్ణ



సీకరిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రమణ



దుప్పులపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వినోద్‌



కాంగ్రింగివలస గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రవీంద్ర



జి.మాడుగుల ఎస్‌ఐ షణ్ముఖరావు

మారేడుమిల్లి: వన్యప్రాణుల వేటకోసం జన సంచార ప్రదేశాల్లో, వ్యవసాయ, ఆటవీ భూముల్లో అనధికారంగా విద్యుత్‌ తీగలు అమర్చి జంతువులు, మానవాళికి హాని కలిగిస్తే ఆటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని ఆకుమామిడికోటలో యువకులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఐక్యంగా జీవించాలని, ఎటువంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎస్‌ఐ రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: విద్యుత్‌ కంచెలు ఏర్పాటు చేసి వన్యప్రాణులు, మనుషుల ప్రాణాలను హాని కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్‌ఐ రవీంద్ర అన్నారు. బాబుశాల పంచాయతీ గాజులబంద, మొండిగుమ్మ, కాంగ్రింగివలస గ్రామాల్లో శుక్రవారం పోలీసులు వన్యప్రాణుల వేట, విద్యుత్‌ కంచెల ఏర్పాటు, గంజాయి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. గంజాయి రవాణా, సాగులకు సైతం దూరంగా ఉండాలని ఆయన కోరారు.

పెదబయలు: మూగజీవులను హతమార్చడానికి విద్యుత్‌ కంచెలు ఏర్పాటు చట్టరీత్యా నేరమని పెదబయలు ఎస్‌ఐ కె.రమణ అన్నారు. సీకరి పంచాయతీలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూగజీవులను హతమార్చడానికి ఏర్పాటుచేసిన విద్యుత్‌ కంచెల వల్ల గిరిజనులు ప్రమాదానికి గురై ప్రాణాలు పోతున్నాయన్నారు. ఎవరైనా పంట పొలాల్లో విద్యుత్‌ కంచెలు, ఉచ్చు ఏర్పాటు చేసి హతమార్చడం నేరమన్నారు. పోలీసు సిబ్బంది, విద్యుత్‌ సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: జంతువులను వేటాడేందుకు వ్యవసాయ, ఆటవీ భూముల్లోను, సంచార ప్రదేశాల్లో అక్రమంగా అనధికారంగా విద్యుత్‌ తీగలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ షణ్ముఖరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. అనధికారగా విద్యుత్‌ తీగలు ఏర్పాటు చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపార్చన



దీపాలు వద్ద మహిళలు

సాక్షి, పాడేరు: పట్టణంలోని సుండ్రుపుట్టు రామాలయం వద్ద శుక్రవారం రాత్రి సహస్ర దీపార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. అనంతరం పూజలు చేశారు.

ఉమ్మడివరంలో భారీ పుట్టగొడుగు



చింతూరు: వి.ఆర్‌.పురం మండలం ఉమ్మడివరం గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఐటీడీఏ కురిసిన వర్షాలకు గాను బ్రహ్మకమలాన్ని పోలినట్టు పెద్ద పుట్టగొడుగు మొలిచింది. ఇంత భారీ ఆకారంలో ఉన్న పుట్టగొడుగును చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనిని చూసేందుకు స్థానిక ఆతోపాటు సమీప గ్రామాల ప్రజలు తరలి వస్తున్నారు.

మన్యంలో దసరా సందడి

- సంతలకు పండగ శోభ
- నాటుకోళ్లు, మేకలకు డిమాండ్‌



రద్దీగా అరకు వారపుసంత



సంతలో విక్రయిస్తున్న నాటుకోళ్లు



సంతలో మేకల అమ్మకాలు

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రం పాడేరుతో పాటు డుంబ్రిగుడ మండలం అరకు వారపు సంతలకు దసరా పండగ కళ సంతరించుకుంది. ఈ రెండు సంతలకు గిరిజనులు భారీగానే తరలివచ్చారు.సాయంత్రం వరకు సంతల్లో వ్యాపారం జరిగింది.పండగకు అవసరమయ్యే సామాగ్రిని గిరిజనులు కొనుగోలు చేయడంతో అన్ని దుకాణాల వద్ద రద్దీ నెలకొంది.పాడేరు పాతబస్టాండ్‌లో ఉదయం కూరగాయల సంత భాగానికే జరిగింది.నాటుకోళ్లు, గొర్రెలు, మేకలకు డిమాండ్‌ నెలకొంది.అధిక ధరలతోనే వాటిని కొనుగోలు చేశారు.సంత ప్రాంతాల్లో ట్రాఫిక్‌ సమస్య కూడా నెలకొంది. వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

డుంబ్రిగుడ: మండలంలోని శుక్రవారం అరకు వారపుసంత కిటకిటలాడింది. సంతలో మేకలు, గొర్రెలు సైజును బట్టి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ధర పలికింది. ఒక్కో కోడికి రూ.2500 నుంచి రూ.3000 ధరలకు కొనుగోలు చేశారు. పందెం కోళ్ల జత రూ.8000 ధరలకు కొనుగోలు చేశారు. దసరా పండుగ సంత కావడంతో ఆంధ్ర సరిహద్దుతో ఒడిశా వాసులు దసరాకు దుర్గ పూజలకు చలువా, పాడువాలు, బంతిపూ పువ్వు ప్రాంతవాసులు అత్యధికంగా పూజల కోసం గొర్రెలు, మేకలు, కోళ్లను కొనడానికి ఎగబడ్డారు. సంతలో కాయ కష్టం చేసి కొండ నుంచి సేకరించి తీసుకొచ్చిన అద్భుతాలు అమ్మి వచ్చిన సొమ్ముతో దుస్తుల కొనుగోలు చేసి ఆనందించారు.

ఎస్‌ఐగా లతశ్రీ బాధ్యతల స్వీకరణ



కూనవరం: కూనవరం ఎస్‌ఐగా ఎల్‌.లతశ్రీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె దుర్గాప్రసాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.